

బీచ్‌రోడ్డులో పరదాలు!

- సీఎంకు మురుగునీటి కాలువ కనిపించకుండా వైసీపీ జెండా రంగులతో కూడిన పరదాలు ఏర్పాటు
- అధికారుల అత్యుత్సాహం



- వార్త 5వ పేజీలో..

నత్తనడకన జల్ జీవన్

సకాలంలో నిధులు విడుదల కాక ముందుకుసాగని పనులు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఇంటింటికీ కొళాయిల ఏర్పాటు ద్వారా తాగునీరు అందించాలన్న కేంద్ర ప్రభుత్వం ఆశయం నీరుగారిపోతోంది. జిల్లాలో జల్ జీవన్ పథకం పనులు ముందుకు సాగడం లేదు. సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోతున్నాయి. నిధుల కొరత లేదని గ్రామీణ నీటి సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పనులు మాత్రం ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని మండలాల్లో అయితే పనులు పదిశాతం కూడా పూర్తికాని పరిస్థితి నెలకొంది.

- కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం మళ్లించడం వల్లే సమస్యలని ఆరోపణలు
- ఇంటింటికీ కొళాయి ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో తెలియని పరిస్థితి



అనకాపల్లి మండలం మారేడుపూడిలో పైపులు తెచ్చి అమర్చకుండా వదిలేసిన దృశ్యం

జిల్లాలో 2017-18 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో అనకాపల్లి జిల్లా పరిధిలోని మండలాల్లో 4.18 లక్షల కుటుంబాలకు జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికి కొళాయిలు అమర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అప్పట్లో 2,163 ప్యాకేజీల కింద పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక దాదాపు ఏడాది కాలం పాటు పనులు నిలిచిపోయాయి. 2020లో మళ్లీ జల్‌జీవన్ పనులను వైసీపీ ప్రభుత్వం ప్రారంభించినా సకాలంలో నిధులు విడుదలకాకపోవడం, చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండడం వంటి కారణాలతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారుల గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు జిల్లాలో 2022-23 సంవత్సరం నాటికి 2,52,402 లక్షల కుటుంబాలకు మాత్రమే కొళాయిలు అమర్చారు. 2023-24లో మరో 10,694 కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో 2,63,096 కొళాయిలు మాత్రమే ఇచ్చారు. మిగతా పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల పైపులు గ్రామాలకు చేరవేసినా ఏర్పాటు మాత్రం చేయలేదు. మరి కొన్ని చోట్ల కొళాయిలు అమర్చి నీరు ఇవ్వకుండా అరకొరగా పనులు చేపట్టారు.



జల్‌జీవన్ మిషన్ పనులు మంజూరైనా ఒక్క ఇంటికి కూడా కొళాయి ఏర్పాటు చేయని గొలుగొండ మండలం చీడిగుమ్మలు గ్రామం

బిల్లులు అందక పనులు నత్తనడకన

జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు సకాలంలో విడుదల చేయకపోవడంతో పనులు వేగవంతంగా సాగడం లేదు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతరత్రా అవసరాలకు మళ్లిస్తూ, చేసిన పనులకు కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని తెలిసింది. జిల్లాలో ఇప్పటికే కాంట్రాక్టర్లు చేసిన పనులకు రూ.6 కోట్లు వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. అనకాపల్లి, మునగపాక, కశింకోట మండలాల పరిధిలో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అనకాపల్లి మండలం మారేడుపూడి, గొలగాం పంచాయతీల్లో పనులు నెలల తరబడి కొనసాగుతున్నాయి. ఎప్పుడు పూర్తవుతాయో స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకే తెలియడం లేదు. కశింకోట మండలంలో 78 గ్రామాల్లో పనులు చేపట్టేందుకు ప్రతిపాదించారు. వీటిలో 32 చోట్ల పనులు ప్రారంభమైనా పనులు నెమ్మదిగా జరుగుతుండడంతో కేవలం 4,300 ఇళ్లకు మాత్రమే కనెక్షన్లు ఇవ్వగలిగారు. గొలుగొండ మండలంలో 18 గ్రామాల్లో ఇంటింటా కొళాయిలు ఏర్పాటు చేయాలని భావించినా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. గ్రామ సంఘాల ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. చోడవరం మండల పరిధిలోని గ్రామాల్లో 18 వేల ఇళ్లకు ఇంటింటికి కొళాయిలు అమర్చాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నా, పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు 12 వేల కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. మిగిలిన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్లు చేసిన పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని, బిల్లుల చెల్లింపులు జరుగుతున్నాయో?, లేదో అనేది తమకు సమాచారం ఉండదని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు చెబుతున్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన ఇంటింటికి కొళాయిల ఏర్పాటు పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

సీఎం సమావేశం కోసం అధికారుల తిప్పలు

- నేడు విశాఖలో పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి సమావేశం

ప్లీజ్... తప్పకుండా రండి!

- విజయవంతం చేసే బాధ్యత అధికార యంత్రాంగానికి అప్పగింత
- సరకు రవాణా రంగంలో ఉన్నవారితో పోర్టు సమావేశం
- రంగంలోకి ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఏపీఐఐసీ
- మరోవైపు కలెక్టరేట్ నుంచి ప్రత్యేకంగా ఒక్కొక్కరికీ మూడేసి సార్లు ఫోన్లు
- సమావేశాన్ని రక్తి కట్టించడానికి వైసీపీ భక్తుల్లో ముగ్గురికి ప్రశ్నలు అడిగే అవకాశం
- ఏమి అడగాలో వారికి ముందే సూచన
- వాటికి సమాధానాలు కూడా సిద్ధం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం విశాఖపట్నం పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహిస్తుండడంతో దానిని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం ఆపసోపాలు పడుతోంది. ఇటీవల కాలంలో విశాఖలో సీఎం కార్యక్రమాలను సక్సెస్ చేసే బాధ్యతను అధికారులపై పెడుతున్న సంగతి తెలిసిందే. గత నెలాఖరుల శారదా పీఠానికి వచ్చినప్పుడు విమానాశ్రయం నుంచి చినముషిడివాడ వరకు మహిళలను దారిపొడవునా ఎండలో నిల్చోబెట్టి స్వాగతం పలికించిన సంగతి తెలిసిందే.

రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో 'వైజాగ్ విజన్...ఫ్యూచర్ విశాఖ' పేరుతో మంగళవారం నిర్వహిస్తున్న సమావేశానికి పారిశ్రామికవేత్తలను సమీకరించే బాధ్యతను వైసీపీ పెద్దలు...అధికార యంత్రాంగానికి అప్పగించారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం పోర్టు అధికారులు సరకు రవాణా వ్యాపారంలో ఉన్న వారందరినీ సోమవారం రాత్రి నోవాటెల్‌లో సమావేశపరిచి సీఎం సమావేశానికి రావాలని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అలాగే ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) వంటి సంస్థల నుంచి సభ్యులు అంతా హాజరు కావాలని కోరారు. ఇది కాకుండా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రతి పారిశ్రామికవేత్తకు ఫోన్ చేసి సీఎం సమావేశానికి రావాలని కోరుతున్నారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకూ జరిగే ఈ కార్యక్రమానికి ఉదయం 10 గంటలకే హాజరు కావాలని, దీనికి పాస్‌లు కూడా ఇస్తున్నామని చెబుతున్నారు. వస్తున్నారా?, లేదా?...అంటూ కన్‌ఫర్మేషన్ ... మిగతా 6వ పేజీలో

నేడు సీఎం విశాఖ రాక



విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ రానున్నారు. ఆయన విజయవాడ నుంచి విమానంలో ఉదయం 10.30 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు రుషికొండలోని ఐటీ హిల్ నంబర్-3కు వెళతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాడిసన్ బ్లూ హోటల్‌కు 11 గంటలకు చేరుకుంటారు. 'వైజాగ్ విజన్-ఫ్యూచర్ విశాఖ' పేరిట నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొంటారు. 12.35 గంటలకు రాడిసన్ నుంచి బయలుదేరి పీఎం పాలెంలోని 'వి' కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ 'ది కాస్కేడింగ్ సిల్క్స్-భవిత' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రుషికొండ ఐటీ హిల్-3పైకి చేరుకుని హెలీకాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు వెళతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు విమానంలో విజయవాడ తిరిగి వెళ్లిపోతారు.

ఏసీబీ వలలో వీఆర్వో

- వీఆర్‌ఏ కూడా..
- రైతు నుంచి లంచం తీసుకుంటూ చిక్కిన వైనం



ఏసీబీ అధికారులకు పట్టుబడిన గుమ్మిడిగొండ వీఆర్వో సింహాచలం, వీఆర్‌ఏ లోవరాజు

నాతవరం, మార్చి 4: నాతవరం తహసీల్దార్ కార్యాలయంలో ఓ రైతు నుంచి లంచం తీసుకుంటున్న వీఆర్వో, వీఆర్‌ఏలను ఏసీబీ అధికారులు సోమవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ రమ్య తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నాతవరం మండలం గుమ్మిడిగొండ గ్రామానికి చెందిన అడిగర్ల వంశీకృష్ణ అనే రైతు తన తండ్రి పేరున ఉన్న రెండు ఎకరాల 16 సెంట్ల భూమికి సంబంధించి మ్యూటేషన్, అడంగల్ కరెక్షన్‌కు గుమ్మిడిగొండ గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్వో) జుర్రా సింహాచలం, గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ) చేవల్ల లోవరాజును సంప్రదించాడు. దీంతో రూ.8 వేలు లంచం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై ఆ రైతు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు ఆ రైతు సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. వీఆర్వో సింహాచలానికి రూ.6 వేలు,వీఆర్‌ఏ లోవరాజుకు రూ.2 వేలు ఇచ్చాడు. అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాత్రి వరకు తహసీల్దార్ కార్యాలయంలోనే విచారణ జరిపారు. వీఆర్వో, వీఆర్‌ఏలను మంగళవారం విశాఖలోని ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్టు అధికారులు తెలిపారు.

ఏసీబీకి చిక్కుతున్నా మారని వైఖరి

నాతవరం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే వీఆర్వోలు లంచం తీసుకుంటూ తరచూ ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నా వారి తీరు మారడం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. గతంలో నాతవరం మండలం ఎం.బెన్నవరంలో ఇద్దరు వీఆర్వోలు రైతుల నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఇటీవల పీకేగూడెంలో రైతు నుంచి లంచం తీసుకుంటూ వీఆర్వో ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. జిల్లేడిపూడి, శంగవరం వీఆర్వోలు కూడా ఏసీబీ అధికారులకు గతంలో పట్టుబడ్డారు. గతంలో ఓ తహసీల్దార్ కూడా ఏసీబీ అధికారులకు చిక్కారు. అయినా ఇక్కడి రెవెన్యూ అధికారుల వైఖరి మారడం లేదని స్థానికులు చెబుతున్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం పొడిగింపు

- మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

చోడవరం, మార్చి 4 : నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్టు విప్ ధర్మశ్రీ తెలిపారు. ఇక్కడి మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఇతర డైరెక్టర్ల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరుతో ముగిసింది. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలలు పదవీ కాలం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వలంటీర్ల చందాల దందా

- గ్రామ దేవత జాతర పేరిట బలవంతంగా వసూళ్లు
- వైసీపీ నేతల ఆదేశంతో పింఛన్ నగదులో సగం వరకు కోత
- లబ్ధిదారుల గగ్గోలు
- ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పింఛన్‌దారులు

రోలుగుంట, మార్చి 4 : గ్రామ దేవత జాతర పేరిట పింఛన్‌దారుల నుంచి వలంటీర్లు బలవంతంగా చందాలు వసూలు చేస్తున్నారు. ఈ నెల ఇచ్చిన సామాజిక పింఛన్‌లో లబ్ధిదారుల నుంచి సగం నగదు తీసుకున్నారు. దీంతో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. సోమవారం వీరంతా ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేశారు.



తహసీల్దార్ రవిచంద్రకు వినతిపత్రం ఇస్తున్న పింఛన్‌దారులు

మండలంలోని కుసర్లపూడిలో ఈ నెల 1వ తేదీ నుంచి వలంటీర్లు సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఈ గ్రామంలో అన్ని రకాల పింఛన్లు కలిపి 350 వరకు ఉన్నాయి. కాగా ఈ నెల 24న గ్రామ దేవత జాతర మహోత్సవం సందర్భంగా చందాలు వసూలు చేసే పనిని స్థానిక వైసీపీ నాయకులు గ్రామ వలంటీర్లకు అప్పగించారు. దీంతో 14 మంది గ్రామ వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని పింఛన్‌దారుల నుంచి చందాలు వసూలు చేశారు. పింఛన్ పంపిణీ కోసం లబ్ధిదారుల నుంచి బయోమెట్రిక్ తీసుకుని ఒక్కొక్కరి నుంచి రూ.1500 వసూలు చేశారు. ఈ ... మిగతా 6వ పేజీలో

వలంటీరు రూ.1500 తీసుకున్నాడు



ఎప్పటిలాగానే గ్రామ వలంటీరు వచ్చి పింఛన్ ఇస్తానని చెప్పి వేలిముద్ర వేయించుకున్నాడు. ఆ తరువాత రూ.1500 చేతిలో పెట్టాడు. ఏమని అడిగితే చందాలు వసూలు చేస్తున్నాం, ఈ నెల సగం పింఛన్ డబ్బులే ఇస్తున్నామని చెప్పాడు. నాకు పింఛన్ డబ్బులే ఆధారం. కోత విధించడంతో ఈ నెల ఎలా గడుస్తుందో అర్థం కావడం లేదు. కొత్తగా పింఛన్లు మంజూరు అయిన వారి నుంచి రూ.3000 చొప్పున తీసుకున్నారు. ఇది చాలా ఘోరం.

- మతం నరసయ్య, పింఛన్‌దారుడు, కుసర్లపూడి

కారిడార్ నిర్వాసిత రైతుల ధర్నా

- ఉపమాక నుంచి నక్కపల్లి వరకు ర్యాలీ

నక్కపల్లి, మార్చి 4: ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అప్పటి వరకు విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూముల్లో ఎటువంటి పనులు చేపట్టకూడదని కారిడార్ నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం పలు గ్రామాలకు చెందిన కారిడార్ నిర్వాసితులంతా ఉపమాక గ్రామానికి చేరుకున్నారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం.అప్పలరాజు, బుచ్చిరాజుపేట సర్పంచ్ కాళ్ల శ్రీను, అలాపురం ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, డీఎల్‌పురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు గింజాల వెంకట రమణ, చందనాడ మాజీ సర్పంచ్ మేడిశెట్టి చంద్రరావు తదితరులు మాట్లాడారు. ఆనాడు ప్రతిపక్ష నేతగా వున్న జగన్ తాను అధికారంలోకి వస్తే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇస్తామని చెప్పారని, కానీ ఇంతవరకూ అది కార్యరూపం దాల్చలేదన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి, 18ఏళ్లు వయస్సు నిండిన వారికి పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఒక్కొక్కరికి 10 సెంట్లు స్థలం కేటాయించి, మెరుగైన పునరావాసం తాము కోరిన చోట ఇవ్వాలన్నారు.15 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీకాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎం.బాబ్జీ, ఆర్.గోవిందరావు, వి.శివ, చంటమ్మ, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.



నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కారిడార్ నిర్వాసిత రైతులు



సభా ప్రాంగణం మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఐజీ విశాల గున్నీ, ఎస్పీ మురళీకృష్ణ

సీఎం సభా ప్రాంగణం పరిశీలన

కొత్తూరు, మార్చి 4: పిసినికాడలో ఈ నెల 7న జరగనున్న ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లను విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని సోమవారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు 50 వేల మంది సరిపడే విధంగా సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశామన్నారు. సుమారు 1500 మంది పోలీసు సిబ్బందితో భద్రత కల్పిస్తున్నామన్నారు. అంతకుముందు హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను డీఐజీ పరిశీలించారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ, అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ, అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, సీఐలు శంకరరావు, ధనుంజయ, వినోద్‌బాబు, ఎస్‌ఐలు సత్యనారాయణ, రమేశ్‌బాబు తదితరులు ఉన్నారు.

క్రైం... crime news

రైలు ఢీకొని కౌలు రైతు మృతి

ఎలమంచిలి, మార్చి 4 : ఎలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో జంప పాలెం అండర్ బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొన్న ప్రమాదంలో జంప పాలెం గ్రామానికి చెందిన కౌలు రైతు వెలగా దాసు(71)మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. జంపపాలెం గ్రామానికి చెందిన వెలగా దాసు గ్రామంలో కౌలుకు పొలం తీసుకుని జీవనాధారం సాగిస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం తన ఇంటి నుంచి పొలానికి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో అనకాపల్లి నుంచి తుని వైపు ప్రయాణించే గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్టు ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతదేహాన్ని శవ పరీక్ష అనంతరం బంధువులకు అప్పగించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రాంబిల్లి, మార్చి 4 : మండలంలోని మామిడివాడ కొత్తూరు జంక్షన్ సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్రి వెంకటలక్ష్మి(32) అనే మహిళ మృతి చెందింది. అచ్యుతాపురం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన కర్రి వెంకటలక్ష్మి, ఆమె భర్త శివ మామిడివాడ సమీపంలో కౌలుకు తీసుకున్న పొలానికి మోపెడ్‌పై వస్తుండగా మామిడివాడ కొత్తూరు జంక్షన్ సమీపానికి వచ్చే సరిగి టిప్పర్‌లారీ వెనుక నుంచి ఢీకొందని స్థానికులు తెలిపారు. వెంకటలక్ష్మి సంఘటనా స్థలంలో మృతి చెందగా.. భర్త శివకు స్వల్పగాయాలయ్యాయి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మృతురాలు బంధువులు సంఘటనా స్థలంలో కొంతసేపు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న రాంబిల్లి సఐ లక్ష్మణరావు సంఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో వారు విరమించారు. భర్త శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ లచ్చన్నదొర తెలిపారు.

భవనంపై నుంచి పడి మహిళకు తీవ్ర గాయాలు

బుచ్చెయ్యపేట, మార్చి 4 : మండలంలోని ఓ గ్రామంలో ఇంటి నిర్మాణంలో భాగంగా శ్లాబ్ వేస్తుండగా ప్రమాదవశాత్తూ కిందకు పడిపోవడంతో వివాహితకు తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. లైపురం గ్రామానికి చెందిన నక్క సత్యవతి ఇంటికి శ్లాబ్ వేస్తుంది. ఈ పనుల్లో ఉండగా సోమవారం ఒక్కసారిగా కిందకు పడిపోవడంతో ఆమె అపార్మక స్థితికి చేరుకుంది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా మారడంతో విశాఖ కేజీహెచ్‌కు వైద్యులు రిఫర్ చేశారు.

మహిళ మృతదేహం లభ్యం

కశింకోట, మార్చి 4: మండలంలోని వెదురుపర్తి గ్రామానికి వెళ్లే బ్రిడ్జి వద్ద శారదానదిలో మహిళ మృతదేహం సోమవారం రాత్రి లభ్యమైంది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వ్యక్తి వివరాలను ఆరా తీస్తున్నారు. క్లూస్ టీం అక్కడికి చేరుకొని ఆధారాలు సేకరించింది. ఈ మృతదేహం వారం రోజుల కిందట నదిలో కొట్టుకు వచ్చి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మృతదేహమంతా నాచుపట్టి గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి మార్చురీకి పోలీసులు తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ఎస్.రాయవరం, మార్చి 4: జాతీయ రహదారిపై సోమవారం రెండు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఇద్దరి డ్రైవర్లకు గాయాలయ్యాయి. కోదాడ నుంచి కశింకోట మండలం బయ్యవరంలోని సిమెంట్ ఫ్యాక్టరీకి క్లింకర లోడ్‌తో వెళుతున్న లారీ గోకులపాడు సమీపంలో అదుపుతప్పి బోల్తా పడడంతో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కాగా లారీలో ఉన్న క్లింకర్ జాతీయ రహదారిపై పడిపోవడంతో ఒకటిన్నర కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోయాయి. హైవే పెట్రోలియం పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఎస్ఐ విభీషణరావు ఎక్స్‌కవేటర్‌తో క్లింకర్‌ను తొలగింపజేశారు. అలాగే పెనుగొల్లు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన మరో ప్రమాదం జరిగింది. రాజమండ్రి నుంచి శ్రీకాకుళం జిల్లా కొత్తూరు వెళుతున్న మినీ వ్యాన్ ముందు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో ఢీకొంది. దాని వెనుక వస్తున్న కారు మినీ వ్యాన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్ డ్రైవర్ శివ గాయపడ్డాడు. అతనికి పెనుగొల్లు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. ఈ ప్రమాదాలకు ఎటువంటి కేసులు నమోదు చేయలేదని ఎస్ఐ విభీషణరావు చెప్పారు.

బీచ్ రోడ్డులో పరదాలు!

- సీఎంకు మురుగునీటి కాలువ కనిపించకుండా వైసీపీ జెండా రంగులతో కూడిన పరదాలు ఏర్పాటు



విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన సమయంలో అధికారులు ఒక్కొక్కసారి రోడ్డుకు ఇరువైపులా పరదాలు ఏర్పాటుచేస్తుంటారు. ఇప్పటివరకూ ఈ తరహా పరదాలు ఇతరులకు సీఎం కనిపించకుండా, సీఎంకు అవతలివాళ్లు కనిపించకుండా ఏర్పాటుచేస్తూ వచ్చారు. కానీ, మంగళవారం విశాఖ వస్తున్న సీఎంకు ఇక్కడ ఉన్న మురుగునీరు కాలువలు కనిపించకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 'వైజాగ్ విజన్..ఫ్యూచర్ విశాఖ' పేరుతో రుషికొండలోని రాడిషన్ బ్లూ హోటల్‌లో నిర్వహించే సమావేశానికి సీఎం హాజరవుతున్నారు. అయితే హోటల్ దాటిన తరువాత గిరిజన భవన్‌కు ఆనుకుని మురుగునీటి కాలువ, సూయిజ్ ప్లాంట్ ఉన్నాయి. అవి రెండూ కనిపించకుండా అధికారులు వైసీపీ జెండా రంగులతో కూడిన పరదాలను ఎత్తుగా ఏర్పాటుచేశారు. మురుగునీటి కాలువ కూడా సీఎంకు కనపడకుండా చేయాల్సినంత అవసరం ఏమొచ్చిందని స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.

విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

- పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాఖపట్నం, మార్చి 4: విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సాగర్‌నగర్ సమీపంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో మంగళవారం 'విజన్ విశాఖ' పేరుతో నిర్వహించనున్న సదస్సుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం హోటల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'విజన్ విశాఖ' సదస్సుకు దాదాపు రెండు వేల మంది పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్నారన్నారు. అన్ని రంగాల్లో విశాఖను అభివృద్ధి చేయాలనేది ఆయన లక్ష్యమన్నారు. అలాగే జీవీఎంసీ పరిధిలో రూ.1,500 కోట్లతో చేపట్టనున్న పనులకు ఆయన శంకుస్థాపన చేయనున్నారన్నారు. ముడసర్లోవలో జీవీఎంసీకి నూతన భవన నిర్మాణం, కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నగరానికి నీటి సరఫరా, సాగర్‌నగర్ బీచ్ రూ.10 కోట్లతో అభివృద్ధి, వెంకోజీపాలెం నుంచి మేరియట్ హోటల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం వంటి పనులకు శంకుస్థాపన చేయనున్నారన్నారు. ఎన్నికల ముందు విజన్ గుర్తువచ్చిందా అని ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు..తమ ప్రభుత్వానికి ముందు నుంచి విజన్ వుందని మంత్రి సమాధానం ఇచ్చారు. ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు ఏర్పాటుకు సిద్ధమవుతోందని, అందుకు ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అనకాపల్లిలో ఈ నెల ఏడో తేదీన 'వైఎస్ఆర్ చేయూత' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నట్టు మంత్రి చెప్పారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	264.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

ప్రభుత్వ స్థలంలో ఆగని అక్రమ నిర్మాణం!

- నెల రోజుల్లో పూర్తయిన సిటీ క్లబ్ షాపింగ్ కాంప్లెక్స్ భవనం
- అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో రేయింబవళ్లు పనులు



సిటీ క్లబ్ ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ భవనం

నర్సీపట్నం, మార్చి 4 : ఎవరు ఎన్ని ఫిర్యాదులు చేసినా.. అధికారులు నోటీసులు జారీ చేసినా.. అక్కడ సిటీ క్లబ్ షాపింగ్ కాంపెక్స్ భవన నిర్మాణ పనులు ఆగలేదు. సరికదా.. మెయిన్ రోడ్డు వైపు పరదాల కట్టి మరీ పగలు, రాత్రి అన్న తేడా లేకుండా పనులు త్వరితగతిన చేయించారు. కేవలం నెల రోజుల్లో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేసి రేపో మాపో ప్రారంభానికి సైతం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం భవనానికి సున్నాలు వేసి, మెయిన్ గేటు అమర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సిటీ క్లబ్ ఎదురుగా తహసీల్దార్ కార్యాలయం పక్కనే సబ్ కలెక్టర్ కార్యాలయం ఉంది. మెయిన్ రోడ్డులో సుమారు రూ.40-50 కోట్లు విలువ చేసే గ్రామ కంఠం స్థలంలో అనుమతులు లేకుండా కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణం జరుగుతుంటే అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్యుల విషయంలో అయితే అధికారులు ఇలాగే వ్యవహరిస్తారా.. అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. అధికారులకు పెద్ద ఎత్తున ముడుపులు అందాయనే ఆరోపణలు వస్తున్నాయి. నోటీసులు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని విమర్శిస్తున్నారు. త్వరలో ఎన్నికలు వస్తున్నాయి.. సిటీ క్లబ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం విషయంలో అధికారులు ఎవరూ తల దూర్చకండి.. తనకు ఇబ్బంది వస్తుందని అని ఎమ్మెల్యే గణేశ్ అధికారుల నోర్లు నొక్కేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎటువంటి డాక్యుమెంట్లు లేవు...!

మునిసిపాలిటీలోని గ్రామ కంఠం సర్వే నెంబరు 357/3లో 55 సెంట్లు విస్తీర్ణంలో నర్సీపట్నం (సిటీ) క్లబ్ ఉంది. పూర్వం గ్రామ పెద్దలు, అధికారులు టెన్నిస్, షటిల్ వంటి ఆటలు ఆడుకోవడానికి రిక్రియేషన్ క్లబ్ కోసం స్థలాన్ని వాడుకునే వారు. దీనికి ప్రభుత్వ పట్టా కాని, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కాని లేవని అంటున్నారు. దీంతో డాక్యుమెంట్ పుట్టించడానికి సిటి క్లబ్ కమిటీ ప్రయత్నాలు చేసినట్టు చెప్పుకుంటున్నారు. తహసీల్దార్ ఎండార్స్‌మెంట్ తీసుకొని దాని ద్వారా రిజిస్ట్రేషన్ చేయిద్దామని ప్లాన్ చేశారని ప్రచారంలో ఉంది. అందులో భాగంగా నర్సీపట్నం తహసీల్దార్‌కు ఎండార్స్‌మెంట్‌కి దరఖాస్తు చేసుకున్నారని తెలిసింది. సర్వే నెంబరు 357/3లోని 55 సెంట్లు గ్రామ కంఠం స్థలం, అందులోని భవనం నర్సీపట్నం క్లబ్ అనుభవంలో ఉందని 2022 అక్టోబరు 10 తేదీన తహసీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. ఎల్‌పీసీ సర్టిఫికేట్ ఇవ్వడానికి ముడుపులు అందుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే రిజిస్ట్రేషన్‌కి డాక్యుమెంట్లు తప్పనిసరి అని తెలిసి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారని సమాచారం. ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో మొదట రెండు అంతస్తులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేశారని, ఇప్పుడు దాన్ని ఆనుకొని మరో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తున్నారని అంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ కంఠం స్థలం యథావిధిగా వాడుకోవడం తప్పితే కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయకూడదు. ఇదిలావుంటే, సిటీ క్లబ్‌లో సబ్ కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, గ్రామ పెద్దలు టెన్నిస్, చెస్ వంటి ఆటలు ఆడుకునేవారు. కాల క్రమేణా సిటీ క్లబ్ పేకాటకు నిలయంగా మారిందని పలువురు సామాజిక కార్యకర్తలు విమర్శిస్తున్నారు. మద్యం ఏరులై పారుతుందని అంటున్నారు. ఇందులో సభ్యత్వం కావాలంటే రూ.రెండు లక్షలు చెల్లించాలని, సభ్యులకు సకల సౌకర్యాలు ఉంటాయని చెబుతున్నారు. ఇక్కడ ఏం జరుగుతుందో పట్టణంలో అందరికీ తెలిసినా పోలీసులు చూసీ చూడనట్టు పోవడానికి కారణాలు ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నిర్మాణంపై చర్యలు తీసుకుంటాం : ఆర్డీవో

సిటీ క్లబ్ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం ఆర్డీవో జయరాం సోమవారం విలేకరులతో అన్నారు. ఇందులో భాగంగా మూడు సార్లు నోటీసు ఇచ్చామని వివరించారు. త్వరలో మునిసిపల్ చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

అనకాపల్లి సభ నుంచే ఎన్నికల శంఖారావం

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, మార్చి 4: నియోజకవర్గంలోని పిసినికాడ సభ నుంచే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరిస్తారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడో తేదీన పిసినికాడలో సీఎం చేయూత లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించే సభలో పాల్గొంటారన్నారు. ఎన్నికలకు నెల రోజులు సమయం ఉన్నందున ఈ సభను ఎన్నికల ప్రచార సభగా ఉపయోగించుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్లి అందించిందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

కొత్తూరు : పిసినికాడలో ఈనెల 7వ తేదీన జరగనున్న సీఎం సభా ప్రాంగణాన్ని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ.సత్యవతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చేయూత లబ్ధిదారులకు నాల్గో విడత నిధులను ముఖ్యమంత్రి విడుదల చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఆర్డీవో చిన్నికృష్ణ, డీపీవో శిరీషారాణి, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, డీఈఈ ధనుంజయ్, మైన్స్ ఏడీ సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం చేయండి

- జేసీ జాహ్నవి



అర్జీదారుని అందించిన వినతిపత్రాన్ని చదువుతున్న జేసీ జాహ్నవి



అర్జీదారునితో మాట్లాడుతున్న ఏఎస్పీ సత్యనారాయణరావు

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 4: స్పందన అర్జీలకు స్పష్టమైన జవాబు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి అధికారులను ఆదేశించారు. శంకరంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో జేసీ జాహ్నవిపాటు డీఆర్వో బి.దయానిధి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 293 మంది అర్జీదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా జేసీ జాహ్నవి మాట్లాడుతూ స్పందన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. అర్జీలను త్వరగా పరిష్కరించి, అర్జీదారుడు చేసుకున్న ఫిర్యాదుపై ముక్తసరిగా కాకుండా తిరస్కరణపై వివరంగా తెలియజేయాలన్నారు. స్పందనలో వచ్చే అర్జీలు భూసమస్యలు, రేషన్‌కార్డులపై అధికంగా వస్తున్నాయని సంబంధిత అధికారులు వాటి పరిష్కారంలో దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఏఎస్పీక్రైమ్ సత్యనారాయణరావు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోలీస్ అధికారులు పనిచేయాలని జిల్లా ఏఎస్పీ క్రైమ్ సత్యనారాయణరావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. అనంతరం అర్జీదారులతో ముఖాముఖంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సత్యనారాయణరావు మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడూ పరిష్కరించి ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు గురించి నిర్దీత సమయంలో నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. స్పందన ముగిసే సరికి 47 అర్జీలు అందగా అందులో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి ఫిర్యాదులు అందాయన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో చోడవరం యువకుడికి కాంస్య పతకం



కాంస్య పతకంతో మణికంఠ

చోడవరం, మార్చి 4 : జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన యువకుడు కాంస్య పతకం సాధించాడు. ఇండియన్ బాడీ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 2, 3 తేదీల్లో బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ పోటీలను నిర్వహించారు. చోడవరానికి చెందిన కోన మణికంఠ కాంస్య పతకం దక్కించుకున్నాడు. 75కిలోల వెయిట్ విభాగంలో ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఇతని తల్లిదండ్రులు కోన ఈశ్వరరావు, కృష్ణవేణి. ఈ సందర్భంగా విజేతను పలువురు ప్రశంసించారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు వడ్డాది విద్యార్థిని ఎంపిక



పతకాలతో హైత్రిక

బుచ్చెయ్యపేట, మార్చి 4: అబాకస్ పోటీల్లో మండలంలోని వడ్డాదిలో గల అక్షర స్కూల్ విద్యార్థిని దొండా హైత్రిక అద్భుత ప్రతిభ చూపడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అనకాపల్లి ఏడీ స్కూల్ ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్టు స్కూల్ కరస్పాండెంట్ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

నూతన చట్టాలపై పోలీస్ సిబ్బందికి శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 4: నూతనంగా ఏర్పాటు చేసిన మూడు చట్టాలు గురించి ఐదు రోజులుపాటు మొదటి దశ శిక్షణ తరగతులను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ సోమవారం ప్రారంభించారు. పోలీస్ అతిథిగృహం సమావేశమందిరంలో నూతన చట్టాలు గురించి ఆయన వివరించారు. భారతీయ శిక్షాస్మృతి 1860, నేర విచారణ ప్రక్రియ స్మృతి 1973, భారతీయ సాక్షాధార చట్టం 1872లను భారత ప్రభుత్వం ప్రస్తుత సమాజానికి అనుగుణంగా మార్పులు చేసిందన్నారు. వాటి స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) అను నూతన చట్టాలను భారత ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఈ నూతన చట్టాలు జూలై ఒకటి నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో ఈ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో పోలీసులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ చట్టాల పై దఫదఫాలుగా జిల్లా పోలీసులందరికీ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. సోమవారం జరిగిన శిక్షణలో 12వ ఏడీజే కోర్టు అడిషినల్ పీపీ వి.దేవానందరావు పాల్గొని సిబ్బందికి కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి. విజయభాస్కర్, డీటీసీ డీఎస్పీ బి. రామవర్మ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లింగరాజుపాలెంలో సినిమా షూటింగ్



లింగరాజుపాలెంలో ఓ ఇంటిలో జరుగుతున్న బచ్చలమల్లి సినిమా షూటింగ్

ఎస్.రాయవరం, మార్చి 4: హాస్య మీవీస్ బ్యానర్‌లో అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా సుబ్బు బొడ్డా దర్శకత్వంలో రూపొందుతున్న బచ్చలమల్లి షూటింగ్ మండలంలోని లింగరాజుపాలెంలో సోమవారం జరిగింది. గ్రామంలో గల ఓ ఇంటిలో ఈ సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను నటీనటులతో దర్శకుడు సుబ్బు చిత్రీకరించారు. ఈ చిత్రాన్ని రాజేష్ దండా నిర్మిస్తున్నారు. గ్రామంలో సినిమా షూటింగ్ జరుగుతుందని తెలియడంతో స్థానికులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ



మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

అనకాపల్లి, మార్చి 4 (అనకాపల్లి): ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలని అనకాపల్లి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. సుజల స్రవంతి, తోటపల్లి వంటి కీలకమైన ప్రాజెక్టులను అశ్రద్ధ చేసిందన్నారు. అనకాపల్లి వంటి ప్రాంతాల్లో ఉన్న తగరంపూడి, చెర్లోపల్లి వంటి 11 గ్రోయిన్లు ఉండగా అవన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదన్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసినా స్పందన లేదని, ముఖ్యంగా ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. వేసవిలో నీటి ఎద్దడిని అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇంత నిర్లక్ష్యం ఏ ప్రభుత్వం చూపించలేదన్నారు. జనసేన, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి చేతికి పని, ప్రతి ఎకరాకు నీరు అనే మేనిఫెస్టో ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

సూపర్-6 ప్రతి ఇంటికీ తీసుకెళతాం

నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకత్వం బలంగా ఉందని కొణతాల అన్నారు. రెండు పార్టీల బూత్ లెవిల్ కమిటీల సమావేశం త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. టీడీపీ, జనసేన అధినేతలు ఉమ్మడి ఆధ్వర్యంలో రూపొందించిన సూపర్-6 పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

ప్రైవేటు లేఅవుట్ కోసం ప్రభుత్వ స్థలంలో రహదారి

- రెవెన్యూ అధికారులకు టీడీపీ నేతల ఫిర్యాదు
- హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పరవాడ, మార్చి 4 : పరవాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 226లో గల ప్రభుత్వ స్థలంలో లేఅవుట్‌కు వేస్తున్న రోడ్డు పనులను రెవెన్యూ సిబ్బంది సోమవారం అడ్డుకున్నారు. అనంతరం ఆ ప్రదేశంలో ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇదే సర్వేనంబరులో కొంతమేర గెడ్డవాగు ఉంది. రియల్టర్ తమ లేఅవుట్ కోసం గెడ్డ వాగును పూడ్చివేసి, రహదారి నిర్మాణం చేపట్టారు. ఈ విషయాన్ని టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్దార్ గణపతిరావు ఆదేశాల మేరకు వీఆర్వో వెంకటేశ్వరరావు తన సిబ్బందితో వెళ్లి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలంలోంచి రహదారి నిర్మించడం చట్టరీత్యా నేరమన్నారు. సర్వే చేయించి రెవెన్యూ హద్దులను గుర్తిస్తామని తెలిపారు. అప్పటి వరకు రహదారి నిర్మాణ పనులు నిలిపివేయాలని రియల్టర్‌ను ఆదేశించారు. దీంతో పనులను నిలిపివేశారు.

13 మద్యం సీసాలు, నాటుసారాతో ఇద్దరి అరెస్టు

పాయకరావుపేట రూరల్, మార్చి 4: మండలంలో రెండు చోట్ల సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించి 13 మద్యం బాటిళ్లు, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్ఐ జోగారావు పక్కా సమాచారంతో సోమవారం మండలంలోని కేశవరం వద్ద మాటు వేసి శ్రీరాంపురం గ్రామం నుంచి సంచిలో తీసుకు వస్తున్న 13 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్.నర్సాపురం గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. అదే విధంగా మండలంలో రాజవరం గ్రామ శివార్లలో సారాను తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పది లీటర్ల సారాతో మరో ఇద్దరు మహిళలు..

కృష్ణాదేవిపేట, మార్చి 4: పది లీటర్ల సారాతో ఇద్దరు మహిళలను వేర్వేరు చోట్ల పట్టుకుని అరెస్టు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. కొయ్యూరు మండలం రత్నంపేట గ్రామానికి చెందిన లింగేటి సత్యవతి, ఎలుసూరి నూకాలమ్మలు గొలుగొండ మండలం కొంగసింగి రహదారిలో వేర్వేరు చోట్ల సోమవారం సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒక్కొక్కరి వద్ద నుంచి ఐదు లీటర్లు చొప్పున సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యం : పీలా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, మార్చి 4: టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం బీసీలపై కక్షతోనే బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించిందన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణ తీసుకొస్తామన్నారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. ఈనెల ఐదో తేదీన గుంటూరులో జరిగే జయహో బీసీ సభకు పెద్దసంఖ్యలో బీసీలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మళ్ల సురేంద్ర, టీఎస్ఎంకే జోగినాయుడు, పోలారపు త్రినాథ్, తలారి కాశీనాయుడు, కోన శ్రీను, పిట్ల రాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 4 : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం విద్యార్థులు 15,222 పాల్గొనాల్సి ఉండగా 14,706 మంది పరీక్షకు హాజరయ్యారని ఇంటర్మీడియట్ బోర్డు రీజనల్ అధికారి సుజాత తెలిపారు. జనరల్ విద్యార్థులు 12,286 మందికి 11,948 మంది హాజరుకాగా.. 338 మంది హాజరుకాలేదన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 2,936 మందికి 2,758 మంది హాజరయ్యారని, 178 మంది హాజరుకాలేదని ఆమె తెలిపారు.

జయహో బీసీ సభకు తరలివెళ్లిన నేతలు



కారులో మంగళగిరి బయలుదేరుతున్న టీడీపీ శ్రేణులు

అనకాపల్లి టౌన్, మార్చి 4 : గుంటూరు జిల్లా మంగళగిరి నాగార్జున యూనివర్సిటీలో మంగళవారం జరిగే జయహో బీసీ కార్యక్రమానికి అనకాపల్లి నుంచి సోమవారం సాయంత్రం పెద్ద ఎత్తున టీడీపీ బీసీ నాయకులు తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ బీసీ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర ఆధ్వర్యంలో బీసీ నాయకులు పోలారపు త్రినాథ్, పిట్ల రాజు, దొడ్డి రాము, పెంటకోట శ్రీనివాసరావు, ఎస్. భానుచందర్‌లతోపాటు అధికసంఖ్యలో బీసీ నాయకులు తరలివెళ్లారు.

పీలా పేరు పునః పరిశీలించాలని పూజలు

అనకాపల్లి టౌన్, మార్చి 4 : టీడీపీ-జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పీలా గోవింద సత్యనారాయణ పేరును పునఃపరిశీలించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి సబ్బవరపు గణేష్ ఆధ్వర్యంలో సోమవారం భీముని గుమ్మం సీతారామాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో గణేష్‌తో పాటు పార్టీ నాయకులు 108 కొబ్బరి కాయలు కొట్టి పీలా పేరును ప్రకటించాలని పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు కాయల ప్రసన్న, బూత్ ఇన్‌చార్జి బెల్లాన శ్రీనివాస్, డి.కిశోర్‌కుమార్, ఎస్. రామకృష్ణ, షేక్ రియాజ్ పాల్గొన్నారు.

కొత్తూరులో.. తెలుగుదేశం పార్టీ అనకాపల్లి నియోజకవర్గ టికెట్ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు ఇవ్వాలని కోరుతూ అనకాపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు కొత్తూరు, కుంచంగి, కూండ్రం, జంగాలపాలెం, పిసిని కాడ పంచాయతీ బీఆర్‌టీ కాలనీ తదితర గ్రామాల్లో ఉన్న గ్రామ దేవతలు, ఆలయాల్లో 108 కొబ్బరి కాయలు కొట్టారు.

కలెక్టరేట్ ఆవరణలో వీవోఏల ధర్నా



ధర్నా చేస్తున్న వెలుగు వీవోఏలు

అనకాపల్లి రూరల్, మార్చి 4: మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ జిల్లాలోని వీవోఏలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా వెలుగు వీవోఏల ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రూపాదేవి మాట్లాడుతూ హెచ్ఆర్‌సీ పాలసీని అమలు చేయాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వీవోఏలా విలీనాన్ని నిలిపివేయాలని కోరారు. పొదుపు సంఘాలకు 20 లక్షల జీరో వడ్డీ వర్తింపజేయాలని, గుర్తింపు కార్డు, యూనిఫాం అందజేయాలని కోరారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డీఆర్‌డీఏ ఏపీడీ డైజీ ధర్నా వద్దకు విచ్చేసి వీవోఏ సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వీవోఏలు పీడీకిఇ వినతిపత్రం సమర్పించారు. వీవోఏల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకరరావు, వీవోఏలు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ పీవోలకు అభినందనలు : ఎస్పీ



ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 4: రానున్న సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఎన్ఎస్ఎస్ పీవోలను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అభినందించారు. సోమవారం స్థానిక పోలీస్ అతిథిగృహంలో 20 మంది ఎన్ఎస్ఎస్ పీవోలు ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. మీ స్ఫూర్తితో మరింత మంది ముందుకు వచ్చి ఎన్నికల విధుల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే వారికి రవాణా, భోజన సౌకర్యంతో పాటు గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. స్వచ్ఛందంగా ఎన్నికల విధుల్లో సేవలందించాలనుకున్న అధికారులు 8500361036, 9440796086 నంబర్లకు ఫోన్‌చేసి సంప్రదించాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఎస్బీ డీఎస్పీ బి. అప్పారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణమూర్తి, సీఐలు పైడపు నాయుడు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

» సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



ప్రతిజ్ఞ చేస్తున్న సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, మార్చి 4 : పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సింహాద్రి ఎన్టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. 53వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భద్రతను పాటించడం ద్వారానే ప్రమాదాలను అరికట్టవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు సీజీఎం స్థానిక సాగరిక రిక్రియేషన్ క్లబ్ నుంచి ఉద్యోగులతో కలిసి దీపాంజలినగర్ ప్రధాన ద్వారం వరకు మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాం : అదీప్‌రాజ్



సబ్బవరం: ఆర్‌సీ ప్లాట్లు కలిగిన రైతులకు పట్టాల అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం,మార్చి 4 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు, ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతులకు ఆర్‌సీ ప్లాట్ల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పత్రాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.చలమయ్య, ఎంపీపీ బోకం సూర్యకుమారి, పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ శేషుబాబు, నేతలు సురేష్‌రాజ్, బోకం రామునాయుడు, కొటాన రాము, వడ్డాది అప్పలరాజు, గవర రాజు, బండారు శ్రీను, భైలపూడి దేముడుబాబు పాల్గొన్నారు.

పరవాడలో.. పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన అందజేశారు. అనంతరం స్థానిక జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ సమీపంలోని ఇండోర్ స్టేడియంకు ఆనుకుని ఉన్న క్రికెట్ గ్రౌండ్‌కు రూ.45 లక్షలతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాస్, వైస్‌ఎంపీపీ బి.అప్పలరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం : గొల్ల

నక్కపల్లి, మార్చి 4: ముఖ్యమంత్రి జగన్ పాలనలో మహిళ సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్టు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చెప్పారు. సోమవారం సాయంత్రం ఇక్కడ వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో 1,713 సంఘాలకు రూ.10.48కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డీవీఎస్ రాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం,జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక



అనిత సమక్షంలో టీడీపీలో చేరిన తిమ్మాపురం నాయకులు

నక్కపల్లి, మార్చి 4: ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం, అడ్డరోడ్డు గ్రామాలకు చెందిన 30 కుటుంబాల వారు సోమవారం తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ అనిత కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎస్.రాయవరం టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, రాష్ట్ర తెలుగు యువత సెక్రటరీ గుర్రం రామకృష్ణ, కర్రి చందు, వంగలపూడి గోవింద్,అప్పలకొండ పాల్గొన్నారు.

'భూకబ్జాకు పాల్పడుతున్న వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న దొడ్డి శ్రీనివాసరావు

మునగపాక (తుమ్మపాల), మార్చి 4 : మండలంలోని నాగులాపల్లిలో భూకబ్జాకు పాల్పడుతున్న వైసీపీ నాయకులు, అందుకు సహకరిస్తున్న దేవదాయ, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగులాపల్లిలో ఎనిమిది ఎకరాల దేవదాయ శాఖకు చెందిన భూమి ఉందని, దానిని కబ్జా చేసేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ అంశంపై దేవదాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే ఈ అంశంపై చర్యలు తీసుకోవాలని లేదంటే టీడీపీ శ్రేణులంతా తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట విజయ, కర్రి సాయికృష్ణ, పొలమరశెట్టి మురళీ, కాండ్రేగుల శంకర్, పూసల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు

అనకాపల్లి టౌన్, మార్చి 4: కాంట్రాక్టు కార్మికుల పోస్టులు అమ్ముకుంటున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ క్లాప్ వాహనాల్లో చెత్త వేయడానికి లూడర్స్‌ను 27 మందిని తీసుకున్నారన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.70 వేలు నుంచి రూ.లక్ష వరకు కాంట్రాక్టర్, మున్సిపల్ అధికారులు తీసుకున్నారని ఆరోపించారు. అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు, కార్మికులు శివకుమార్, అజయ్, నాగరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్ష

అనకాపల్లి టౌన్, మార్చి 4: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుకు నిరసనగా కోర్టు వద్ద అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కూడా రిలే నిరాహారదీక్ష కొనసాగింది. ఈ దీక్షలో న్యాయవాదులు ఒమ్మి సన్యాసిరావు, యుగంధర్, హిమబిందు కూర్చున్నారు. వీరికి న్యాయవాదులు వి.రాజశేఖర్, పి.అప్పలనరసింహం, కర్రి శ్రీనివాసరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

భోగలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లు

అనకాపల్లి టౌన్, మార్చి 4 : స్థానిక గవరపాలెం సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల ఎనిమిదవ తేదీన జరిగే మహాశివరాత్రి వేడుకలకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఛైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆలయ ఆవరణలో జరిగిన ధర్మకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో రావణ వాహనంపై శివతాండవ మూర్తి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆయన తెలిపారు. సమావేశంలో ఈవో కె.ఆదినారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బావనారుషి కల్యాణం



బావనా రుషిని ఊరేగిస్తున్న భక్తులు

ఎలమంచిలి, మార్చి 4: స్థానిక ధర్మవరంలోని బావనా రుషి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను దర్శించుకున్నారు. వేద పండితుల సమక్షంలో బావనా రుషి, భద్రవతీదేవిల కల్యాణాన్ని సంప్రదాయరీతిలో నిర్వహించారు. అనంతరం స్వామివారిని పురవీధుల్లో భక్తి కీర్తనలు, కోలాటాల నడుమ ఊరేగించారు. రాత్రికి శూలాల మహోత్సవాన్ని నిర్వహించారు.

నక్కపల్లిలో..

మండల కేంద్రంలో భావనారుషి శూలాల సంబరం సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. ప్రతీ ఏటా మాఘమాసంలో ఈ పండుగ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకు సంబంధించి పద్మశాలీ, చేనేత సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. భావనారుషి ఆలయం వద్ద పూజారులు పత్రి పూజ చేశారు. సోమవారం రాత్రి నుంచి శూలాల ఊరేగింపు జరిగింది.

ఎలమంచిలి స్టేషన్‌లో రైళ్ల హాల్ట్‌కు వినతి

ఎలమంచిలి, మార్చి 4: స్థానిక రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లు నిలుపుదల చేయాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రయాణికుల సంక్షేమ సంఘ ప్రతినిధులు స్థానిక రైల్వే అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఇటీవల పలు రైళ్లు రద్దు కారణంగా ప్రయాణికులతోపాటు డైలీ ప్యాసింజర్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఎలమంచిలిలో ప్రశాంతి, కోణార్క్, రత్నాచల్ వంటి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, స్థానికులు రమణ, సీతంరాజు, జి.కృష్ణ పాల్గొన్నారు.

శత శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కె.స్వప్న

పాయకరావుపేట, మార్చి 4 : పంచాయతీల్లో ఇంటి పన్నులను శత శాతం వసూలు చేయాలని ఎంపీడీఓ కె.స్వప్న ఆదేశించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పంచాయతీకి సంబంధించి ఇంటి పన్నులు, పన్నేతర ఆదాయాలను రానున్న వారం రోజుల్లో వంద శాతం వసూలుకు కృషిచేయాలన్నారు. అదేవిధంగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు, ఈకేవైసీ, ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ ముమ్మరం చేయాలన్నారు. పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగు, సక్రమంగా తాగునీటి సరఫరా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాలల ఆయాలకు కనీస వేతనాలు చెల్లించాలి

తుమ్మపాల, మార్చి 4: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు జీవో నంబరు 108 ప్రకారం కనీస వేతనం రూ.11,500 చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేపడుతున్న స్వీపర్లకు కనీస గుర్తింపు లేకుండా పోతుందన్నారు. ఉన్నత పాఠశాలల్లో వంద మందికి పైబడి విద్యార్థులుంటే అదనపు ఆయాలు నియమించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వాయిబోయిన శేఖర్, రవికుమార్ పాల్గొన్నారు.

పెదకలవలాపల్లి సచివాలయం వద్ద గేదెలతో నిరసన



సచివాలయం వద్ద గేదెలతో నిరసన చేస్తున్న రైతులు

రాంబిల్లి, మార్చి 4 : పెదకలవలాపల్లిలో రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం స్థానిక సచివాలయం వద్ద మహిళా రైతులు గేదెలతో నిరసన తెలిపారు. నేవీ అధికారులు తమ గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండచుట్టూ ప్రహరీగోడను ఏర్పాటు చేస్తుండడంతో తమ పశువులను ఎక్కడ మేపుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల గేదెలతో నిరసన వ్యక్తం చేస్తున్నామని మహిళలు తెలిపారు.

కామేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన అనిత

నక్కపల్లి, మార్చి 4: మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన హిందూ ధర్మ ప్రచారకుడు పిక్కి కామేశ్వరరావు కుటుంబ సభ్యులను తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత సోమవారం సాయంత్రం పరామర్శించారు. తాము అండగా వుంటామని, ధైర్యంగా వుండాలని భరోసా ఇచ్చారు. అలాగే మండలంలోని వేంపాడు గ్రామంలో మాతృ వియోగంలో వున్న టీడీపీ నేత అయినంపూడి అప్పలరాజును కూడా అనిత పరామర్శించారు. ఆమె వెంట టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కురందాసు నూకరాజు, గింజాల లక్ష్మణరావు, కొప్పిశెట్టి బుజ్జి, బాబ్జీరాజు, వెలగా శ్రీను, ఎరుపిల్లి అప్పలరాజు వున్నారు.

తూర్పుకాపుల సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

రాంబిల్లి, మార్చి 4 : తూర్పుకాపుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశామని పెదకలవలాపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యులు రావి దేముళ్లు తెలిపారు. తూర్పుకాపులకు ఇస్తున్న బీసీ డీ సర్టిఫికెట్లు అన్ని ఎన్నికల్లో రిజర్వేషన్లకు ఉపయోగపడే విధంగా ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాలకు ఉపయోగ పడేవిధంగా ఓబీసీ సర్టిఫికెట్లు కూడా మంజూరు చేయాలన్నారు. రజాల, కుమ్మరాపల్లి గ్రామాల మధ్య మేజర్ శారదా నదిపై వంతెన ఏర్పాటు చేయాలని ఆ వినతిపత్రంలో కోరారు.



సుందరపు సమక్షంలో జనసేనలో చేరిన వైసీపీ శ్రేణులు



జనసేనలో చేరిన రాజుకోడూరు వైసీపీ కార్యకర్తలు

రాంబిల్లి, మార్చి 4 : మండలంలోని రాజుకోడూరుకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం హరిపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. కె.నాయుడు, ఎస్.గోవింద, కె. చినబ్బాయి, ఎస్.నూకరాజుతోపాటు మరో 20 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన అచ్యుతాపురం మండల అధ్యక్షులు భైలపూడి రామదాసు, మండలశాఖ అధ్యక్షులు పప్పల నూకన్నదొర, జనసైనికులు పాల్గొన్నారు.

శారదానగర్‌లో కేంద్ర బలగాల కవాతు



కొత్తూరు, ఫిబ్రవరి 4 : అనకాపల్లిలో శాంతియుత వాతావరణంలో సార్వత్రి ఎన్నికల నిర్వహణకు కేంద్ర బలగాలు సోమవారం కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లో కవాతు నిర్వహించాయి. సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీటీ. పాల్, అనకాపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ కవాతు ఉదయం, సాయంత్రం పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శంకరరావు, ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్, రిజర్వ్ ఆర్ఎస్ఐ భవానిప్రసాద్ పాల్గొన్నారు.



ప్లీజ్.. తప్పకుండా రండి!

... 3వ పేజీ తరువాయి

కూడా తీసుకుంటున్నారు. ఇలా ఒక్కో పారిశ్రామికవేత్తకు మూడేసిసార్లు ఫోన్లు చేస్తున్నారు. మరోవైపు ఏపీఐఐసీకి చెందిన అధికారులు కూడా వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతున్నారు. సమావేశాన్ని విజయవంతం చేసే బాధ్యతను అధికారుల భుజాలపై వేశారు. పార్టీ నాయకులు పిలిస్తే వచ్చే పరిస్థితి లేకపోవడం వల్లే అధికారులపై ఆధారపడ్డారు. ఐటీ, టూరిజం, లాజిస్టిక్స్, ఆక్వా, సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్, ఆస్పత్రులు, రియల్ ఎస్టేట్...ఇలా అన్ని రంగాలకు చెందిన వారిని ఈ సమావేశానికి తీసుకురావాలని, అక్కడి 'సాగరిక' సమావేశ మందిరాన్ని కిటకిటలాడేలా చేయాలని యత్నిస్తున్నారు. సమావేశాన్ని రక్తి కట్టించడానికి వైసీపీ భక్తుల్లో ముగ్గురికి ప్రశ్నలు అడిగే అవకాశం కల్పించారు. ఏమి అడగాలో వారికి ముందే సూచించారు. వాటికి సమాధానాలు కూడా ముందే సిద్ధం చేసుకున్నారు. సీఎం సమావేశం నేపథ్యంలో తమను ఉద్యోగాలకు, కాలేజీలకు వెళ్లనిస్తారా?, లేదా?...అని రుషికొండ మార్గంలో రెగ్యులర్‌గా వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు.

వలంటీర్ల చందాల దందా

... 3వ పేజీ తరువాయి

ఏడాది జనవరిలో కొత్తగా మంజూరైన పింఛన్‌దారుల నుంచి మొత్తం నగదు తీసుకున్నారు. మరికొంత మంది వలంటీర్లు అయితే వేలిముద్రలు వేయించుకుని డబ్బులు తరువాత ఇస్తామని చెప్పి వెళ్లిపోయారని బాధితులు వాపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామం నుంచి అధిక సంఖ్యలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేసి పింఛన్ సొమ్ము ఇప్పించాలని డిమాండ్ చేశారు.

బీకేపల్లిలో 48 మద్యం సీసాలు స్వాధీనం

కోటవురట్ల, మార్చి 4: మండలంలోని బాపిరాజు కొత్తపల్లిలో 48 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఎల్. వరలక్ష్మి ఇంటిపై దాడి చేయగా 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.7,344 ఉంటుందన్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమణయ్య మాట్లాడుతూ పల్లెల్లో ఎవరైనా అక్రమ మద్యం అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేసి, అరెస్టు చేస్తామని హెచ్చరించారు.

రాము కుటుంబానికి ఆర్థిక సాయం

రాంబిల్లి, మార్చి 4 : రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కొత్తూరుకు చెందిన వైసీపీ మండల సోషల్‌మీడియా కన్వీనర్ ఆర్.రామును సోమవారం డీసీసీబీ మాజీ ఛైర్మన్ యు.సుకుమారవర్మ పరామర్శించారు. రాము ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి సిబ్బందిని, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాము కుటుంబానికి రూ.30వేలను సుకుమార్‌వర్మ అందజేశారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ

పాయకరావుపేట రూరల్, మార్చి 4 : మండలంలోని ఈదటం జడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 32 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పి.నాగభూషణం,ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు నీలాపు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన కోట్ని బాలాజీ

తుమ్మపాల, మార్చి 4: టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌ను సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించి పలు అంశాలను చర్చించినట్టు బాలాజీ చెప్పారు. ప్రధానంగా రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమని, కార్యకర్తలను సమాయత్తం చేయాలని లోకేశ్ సూచించినట్టు చెప్పారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పని చేయాలని లోకేశ్ సూచించారన్నారు.

సమన్వయంతో ఎన్నికలు నిర్వహణ

▸▸ అధికారుల సమావేశంలో ఆర్డీవో జయరాం



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, మార్చి 4 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి ఇబ్బందులకు తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో హెచ్‌వీ జయరాం సూచించారు. ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు, తహసీల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కె.జాన్‌లింకన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి పోలింగ్ ముగిసే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎవరెవరు ఏ విధులు నిర్వహించాలన్న దానిపై సమగ్రంగా చర్చించారు. ఎన్నికల నిర్వహణ, నియమావళిలపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు అవసరమన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉన్నది లేనిదీ పర్యవేక్షించాలన్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు అంతా సమన్వయంతో పనిచేయాలని పునరుద్ఘాటించారు.

రెండు చోట్ల ఓట్లు ఫిర్యాదుపై విచారణ

గొలుగొండ, మార్చి 4 : ఇతర ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నవారిని పాకలపా డులోనూ ఓటర్లుగా పేర్ల చేర్చడంపై గ్రామానికి చెందిన పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అటువంటి పేర్లు తొలగించాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఎంపీ డీవో కార్యాలయం ఏవో సోమవా రం విచారణ జరిపారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని పాకలపాడు పంచాయతీలోని 30, 31, 32, 33 పోలింగ్ కేంద్రాల్లో సుమారు 70 ఓట్లు ఇతర ప్రాంతాల్లో నమోదైన ఉన్నప్పటికీ తమ గ్రామంలోనూ నమోదై ఉన్నాయని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన ఇటంశెట్టి భాస్కరరావు, బొడ్డు సత్యనారాయణ ఈ నెల రెండో తేదీన రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో సుమారు డబ్బై ఓట్లు నమోదయ్యాయని గతంలో గ్రామంలో నిర్వహించిన సభలో ఫిర్యాదు చేసినా స్పందన లేకపోయిందని ఆరోపించారు. దీంతో ఈసీ ఆదేశాల మేరకు నర్సీపట్నం ఆర్డీవో ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి బి.సత్యనారాయణ కు విచారణ జరపాల్సిందిగా సూచించారు. దీంతో ఆయన ఫిర్యాదుదారులతో పాటు, వీఆర్‌వో స్వామి సమక్షంలో విచారణ చేపట్టారు. పూర్తి నివేదికను ఎన్నికల కమిషన్‌ను అందించనున్నట్టు ఇక్కడి విలేకరులకు తెలిపారు.

'ప్రకృతి వ్యవసాయంతో సుస్థిర ఆదాయం'



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం, మార్చి 4 : ప్రకృతి వ్యవసాయంతో రైతులకు నాణ్యమైన దిగుబడలతో పాటు సుస్థిర ఆదాయం ఉంటుందని ఎంపీడీవో జె.రాంబాబు సూచించారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ రైతులుకు ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. రైతులు మందుల వినియోగం తగ్గించి కూరగాయాల సాగు చేయాలన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత బండి ప్రసాద్ మాట్లాడుతూ కూరగాయాలను పదిహేను నిముషాలు ఉప్పునీటిలో నానబెట్టడం వలన డబ్బైశాతం రసాయనాలు తీసేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమసాయి నవకిసాన్ సీఈవో అంకంరెడ్డి చంద్రిక పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన



ఉమామహేశ్వరీ దేవి ఆలయం వద్ద శిలాఫలకం ఆవిష్కరణలో బూడి

దేవరాపల్లి, మార్చి 4 : మండల కేంద్రం దేవరాపల్లిలోని ఉమా మహేశ్వరీదేవీ ఆలయం వద్ద ఆడిటోరియం, కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జడ్పీటీసీ కర్రి సత్యం, వి.సింహాచలం నాయుడు, మహేశ్వరినాయుడు, సర్పంచ్ పెంటమ్మ, కృష్ణమూర్తి, కిలపర్తి భాస్కరరావు, కేవీ రమణ, జీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఇటీవల ఉమా మహేశ్వరీదేవీ ఆలయంలో తీర్థం ఘనంగా ముగిసిన సందర్భంగా అన్న సమారాధనను నిర్వహించారు.

అగ్నిబాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజు

రావికమతం, మార్చి4 : బూరుగుపాలెంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కల్పోయిన బాధితుడు నమ్మి అప్పలనాయుడు కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు కోరారు. బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించి, ఆ గ్రామ సర్పంచ్ గోకివాడ రమణతో కలిసి చెరో ఐదు వేల రూపాయలు చొప్పున రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. టీడీపీ నాయకులు ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల చందాల దందా

... 3వ పేజీ తరువాయి

ఏడాది జనవరిలో కొత్తగా మంజూరైన పింఛన్‌దారుల నుంచి మొత్తం నగదు తీసుకున్నారు. మరికొంత మంది వలంటీర్లు అయితే వేలిముద్రలు వేయించుకుని డబ్బులు తరువాత ఇస్తామని చెప్పి వెళ్లిపోయారని బాధితులు వాపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామం నుంచి అధిక సంఖ్యలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేసి పింఛన్ సొమ్ము ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ప్లీజ్... తప్పకుండా రండి!

... 3వ పేజీ తరువాయి

కూడా తీసుకుంటున్నారు. ఇలా ఒక్కో పారిశ్రామికవేత్తకు మూడేసిసార్లు ఫోన్లు చేస్తున్నారు. మరోవైపు ఏపీఐఐసీకి చెందిన అధికారులు కూడా వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతున్నారు. సమావేశాన్ని విజయవంతం చేసే బాధ్యతను అధికారుల భుజాలపై వేశారు. పార్టీ నాయకులు పిలిస్తే వచ్చే పరిస్థితి లేకపోవడం వల్లే అధికారులపై ఆధారపడ్డారు. ఐటీ, టూరిజం, లాజిస్టిక్స్, ఆక్వా, సీఫుడ్ ఎక్స్‌పోర్టర్స్, ఆస్పత్రులు, రియల్ ఎస్టేట్...ఇలా అన్ని రంగాలకు చెందిన వారిని ఈ సమావేశానికి తీసుకురావాలని, అక్కడి 'సాగరిక' సమావేశ మందిరాన్ని కిటకిటలాడేలా చేయాలని యత్నిస్తున్నారు. సమావేశాన్ని రక్తి కట్టించడానికి వైసీపీ భక్తుల్లో ముగ్గురికి ప్రశ్నలు అడిగే అవకాశం కల్పించారు. ఏమి అడగాలో వారికి ముందే సూచించారు. వాటికి సమాధానాలు కూడా ముందే సిద్ధం చేసుకున్నారు. సీఎం సమావేశం నేపథ్యంలో తమను ఉద్యోగాలకు, కాలేజీలకు వెళ్లనిస్తారా?, లేదా?...అని రుషికొండ మార్గంలో రెగ్యులర్‌గా వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు.

ఇక్కడ వృథా.. అక్కడ వ్యథ..!

▸▸ బెన్నవోలు, ఏఎల్‌పురం గ్రామాల్లో పైప్‌లైన్లు లీకేజీ

▸▸ పట్టించుకోని పంచాయతీ పాలకులు

▸▸ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నివాసితులు



బెన్నవోలు వద్ద పైప్‌లైన్ లీకేజీ కారణంగా వృథాగా పోతున్న నీరు



ఏఎల్‌పురంలో పైప్‌లైన్‌కు రంధ్ర పడి వృథాగా పోతున్న నీరు

చోడవరం, మార్చి 4 : కొద్దిరోజుల్లో వేసవి కాలం ఆరంభం కానుంది. ఈ సమయంలో తాగునీటి విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా తక్కువే. గతంలో పాలకులు ఫిబ్రవరి, మార్చి నెలలకే వేసవిలో నీటి సమస్య తలెత్తుకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశంపై యాక్షన్ ప్లాన్ తయారు చేసుకునేవారు. తద్వారా ముందుకు సాగేవారు. అయినప్పటికీ అక్కడక్కడా నీటి ఎద్దడిని తలెత్తినట్టు వార్తలు వస్తూనే ఉండేవి. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో యాక్షన్‌ప్లాన్, దాని అమలుకు నిధులు తదితరాలపై కసరత్తు మాట అటుంచితే, చాలా చోట్ల పైప్‌లైన్లలో తలెత్తిన సమస్యలు సైతం పరిష్కారం కావడం లేదు. ఫలితంగా తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో ఆయా ప్రాంతాల్లో నీటికొరత ఏర్పడుతోంది. ఇందుకు ఉదాహరణగా చోడవరం మండలం బెన్నవోలు వద్ద గల తాగునీటి పథకాన్ని చెప్పవచ్చు. ఈ పథకానికి సంబంధించిన పైప్‌లైన్ తెగిపోవడంతో సోమవారం ఉదయం నుంచి తాగునీరు భారీగా వృథాగా పోతోంది. బెన్నవోలు నుంచి బుచ్చెయ్యపేట వెళ్లే ఈ పథకం పైప్‌లైన్ వాల్వులు విడిపోవడంతో ఈ సమస్య తలెత్తినట్టు పలువురు చెపుతున్నారు. పైప్‌లైన్ నుంచి లీకైన నీరు రోడ్డుమీదుగా చెరువులా పారుతూ వృథాగా పోయింది. ఇది చూసినవారు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి పథకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపడితే ఇటువంటి సమస్యలు తలెత్తవని సూచిస్తున్నారు. ఇదిలావుంటే, ఈ పైప్‌లైన్ లీకేజీపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కనకమ్మ వద్ద ప్రస్తావించగా, పైప్‌లైన్ లీకేజీ సమస్య తమ దృష్టికి వచ్చిందన్నారు. మంగళవారం ఉదయానికి సమస్యను చక్కదిద్దుతామని వివరించారు.

ఏఎల్‌పురంలో...

కృష్ణాదేవి పేట : గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో పలుచోట్ల తాగునీరు వృథాగా పోతోంది. పంచాయతీ కుళాయిలకు నీరు సరఫరా అయ్యే పైప్‌లైన్ పాడవ్వడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. ప్రతి రోజూ పలు చోట్ల వందల లీటర్లు తాగునీరు వృథాగా కాలువల్లో చేరుతున్నట్టు చెపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా అంతా కోరుతున్నారు.



గ్రామంలో మూలకు చేరిన బోరు

పేటమాలపల్లిలో నీటి కష్టాలు

▸▸ 20 రోజులుగా పాడైన బోరు ▸▸ పట్టించుకునేవారు లేక అవస్థలు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గొలుగొండ, మార్చి 4 : మండలంలోని పేటమాలపల్లి గ్రామంలో తాగునీటికి అక్కడివారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొలుగొండ పంచాయతీ శివారున ఉన్న ఈ గ్రామంలోని నూకాలమ్మ వీధిలో సుమారు నలభై ఇళ్లవారు నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు. వీధిలో ఒక్కబోరు మాత్రమే ఏర్పాటు చేశారు. అయితే ఇరవై రోజుల క్రితం ఈ వీధిలో ఉన్న ఆ ఒక్కబోరు పాడైంది. మరమ్మతులు చేపట్టాలని అధికారులను వేడుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అలాగే ఇంటింటి కుళాయిల ద్వారా రెండు రోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితే ఇలా ఉంటే, ఇక వేసవి కాలంలో ఎలా ఉంటుందోనని అంతా ఆందోళన చెందుతున్నారు. దీంతో చేసేది లేక సోమవారం సదరు గ్రామంలో మహిళల ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పంచాయతీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిందిగా వారంతా కోరారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

▸▸ టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశంలో పీవీజీ కుమార్, గవిరెడ్డి స్పష్టీకరణ

▸▸ పార్టీ ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా విజయమే లక్ష్యంగా పనిచేస్తామని వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న పీవీజీ కుమార్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి తదితరులు

చీడికాడ, మార్చి 4 : చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. మండలంలోని తురువోలులో సోమవారం జరిగిన నియోజకవర్గ స్థాయి టీడీపీ, జనసేన కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. అప్పులు ఊబిలో కూరుకుపోయిందని వాపోయారు. మళ్లీ రాష్ట్రం బాగుపడాలన్నా, ప్రజల కష్టాలు తీరాలన్నా సమర్థవంతుడైన చంద్రబాబునాయుడు పాలన ఎంతైనా అవసరమని పేర్కొన్నారు. పార్టీ ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా అంతా సమష్టిగా పనిచేసి గెలిపించుకుని మాడుగుల సీటును చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి చక్రవర్తి సీఎం జగన్ అని ఆరోపించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని, జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లడం తథ్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. నన్నయ వర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు మాట్లాడుతూ అభివృద్ధిలో ఒడిశా కన్నా ఆంధ్ర వెనుకంజలో ఉందన్నారు. ఈ సమావేశంలో జీఎస్ ట్రస్ట్ ఛైర్మన్ గవిరెడ్డి సన్యాసినాయుడు, మూడు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, అద్దెపల్లి జగ్గారావు, మాజీ జడ్పీటీసీలు పోతల రమణమ్మ, పోతల పాత్రునినాయుడు, కశిరెడ్డి అప్పలనాయుడు, నాయకులు గండి ముసలినాయుడు, జూరెడ్డి రాము, పంచాడ దాలినాయుడు, ఉండూరు దేముడు, బొబ్బాది తాతారావు, కన్నూరు సూర్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు జీవీ మూర్తితో పాటు ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరికివానిపాలెంలో ఐదెకరాల నీలగిరి తోట దగ్ధం



అగ్ని ప్రమాదంలో కాలిన నీలగిరి చెట్లు

కె. కోటపాడు, మార్చి 4 : మండలంలోని వారాడ శివారు చిరికివానిపాలెం గ్రామం వద్ద ఐదు ఎకరాల్లో గల నీలగిరి (యూకలిప్టస్) తోట సోమవారం దగ్ధమైంది. బాధితులు వేచలపు సింహాద్రి అప్పడు, చిరికి సన్యాసినాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. యూకలిప్టస్ తోటలో మధ్యాహ్నం సమయంలో మంటలు చెలరేగాయన్నారు. వాటిని గమనించిన కొందరు తమకు తెలియజేయగా, వెంటనే వెళ్లి పరిశీలించి చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించామన్నారు. వారు వచ్చి మంటలను పూర్తిగా అదుపు చేశారన్నారు. ఈ ఘటనలో తాము తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

స్పందనలో 20 మంది అర్జీలు సమర్పణ

నర్సీపట్నం, మార్చి 4 : ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇరవై మంది అర్జీలను సమర్పించారు. వీరందరితో ఆర్డీవో జయరాం మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.నాతవరం మండలం వల్లంపేటలోని భూ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు అడిగర్ల రాజు కోరారు. ఎన్నికలకు సంబంధించిన సమావేశాల సమాచారం, ఫొటోలు విలేకరులు అందరికీ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సీనియర్ జర్నలిస్ట్ సత్యనారాయణ విన్నవించారు. మునిసిపాలిటీ కొత్త వీధికి చెందిన లోవ వితంతు పింఛను ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు అలాగే మరికొందరు భూ సమస్యలు, పింఛన్లు, ఇతర సమస్యలను ఆర్డీవోకు విన్నవించారు.

ఐటీఐలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

నర్సీపట్నం, మార్చి 4 : ప్రధాన మంత్రి కౌశల్ యోజన పథకంలో భాగంగా నిరుద్యోగులకు ఇక్కడి ఐటీఐలో స్వల్పకాలిక ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిషన్ డొమెస్టిక్ సొల్యూషన్, స్ట్రీట్ లైట్స్ అసిస్టెంట్ టెక్నీషియన్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబితాతో ఈనెల 15వ తేదీలోపు కళాశాల వద్ద సంప్రదించాల్సిందిగా కోరారు.

'సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి'



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట, మార్చి 4 : సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని వైసీపీ శ్రేణులకు విప్ ధర్మశ్రీ పిలుపునిచ్చారు. బుచ్చెయ్యపేటలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే అందరి లక్ష్యం కావాలన్నారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరీదేవి, జడ్పీటీసీ దొండా రాంబాబు, నాయకులు జోగా కొండబాబు, గేదెల శేషు, కోరుకొండ అప్పలనాయుడు, దొండా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన సదస్సు

చోడవరం, మార్చి 4 : పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వెంకన్నపాలెంలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని విప్ ధర్మశ్రీ ప్రారంభించి మాట్లాడారు. పశువులలో గర్భకోశ చికిత్స, పాడి పశువుల వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యాధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్లు పల్లా నరసింగరావు, ఏడువాక సత్యారావు, సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అడవిరాజుబాబులు పండుగ



గురందొరపాలెంలో భక్తుల పూజలు

నర్సీపట్నం అర్బన్, మార్చి 4 : మండలంలోని గురందొరపాలెం, కేఎల్‌పురం, పెదబొడ్డేపల్లి గ్రామాల్లో సోమవారం అడవిరాజుబాబులు పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శివారున పొలాల్లో ఉన్న గుడుల వద్దకు వెళ్లి పూజలు జరిపారు. సాయంత్రం గ్రామాల్లో ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన డీఎస్పీ



పరీక్ష కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న డీఎస్పీ

కృష్ణాదేవి పేట,మార్చి 4 : ఇక్కడి ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్ సోమవారం పరిశీలించారు. కేంద్రం వద్ద పోలీసులు సిబ్బంది విధులు, 144వ సెక్షన్ అమలు తదితరాలను తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐ ఎం.ఉపేంద్ర, ఏఎస్ఐ నూకరాజులతో మాట్లాడుతూ పరీక్షా కేంద్రం ఆవరణలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, డిపార్టుమెంట్ అధికారి త్రిమూర్తులుకు పలు సూచనలు చేశారు.

మత్తు పదార్థాలకు అంతా దూరంగా ఉండాలి



ఉపాధి కూలీలతో సమావేశమైన ఎస్ఐ కృష్ణారావు

గొలుగొండ, మార్చి 4 : మత్తు పదార్థాలకు అంతా దూరంగా ఉండాలని ఎస్ఐ కృష్ణారావు సూచించారు. గొలుగొండలోని వీరయ్యదొర చెరువులో సోమవారం ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీలను కలిసి మాట్లాడారు. సారా, గంజాయి వంటి ప్రాణాంతకమైన మత్తుపదార్థాల వల్ల తలెత్తే అనర్థాలను వివరించారు. ముఖ్యంగా యువత ఇటువంటి వాటిపై మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అంతా తమవంతు సహకారం అందించాల్సిందిగా కోరారు. సర్పంచ్ కసిపల్లి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోతురాజులబాబు పండగ



పోతురాజులబాబు దర్శించుకుంటున్న పద్మావతి

గొలుగొండ, మార్చి 4 : పాకలపాడులో పోతురాజులబాబు పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, గ్రామ నాయకులు కరామిరెడ్డి రామన్న, బొడ్డు సత్యనారాయణ, ఇటంశెట్టి సత్యనారాయణలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు వీరాంజనేయస్వామి తీర్థం

మాడుగుల రూరల్, మార్చి 4 : ఎం.కోటపాడులో మంగళవారం వీరాంజనేయస్వామి తీర్థం జరగనుంది. ఇం దుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఎడ్లబండ్ల పరుగు పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

తట్టబంద టీడీపీ కార్యకర్తలు పార్టీ మారలేదు : సర్పంచ్ రమణ



సర్పంచ్ రమణ

రావికమతం, మార్చి 4 : తట్టబంద గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 30 కుటుంబాలు వైసీపీలో చేరినట్టు ఆపార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సర్పంచ్ గోకివాడ రమణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీకి చెందిన వారినే తిరిగి పార్టీ మారి వచ్చారని ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. ఆదివారం విప్ కరణం ధర్మశ్రీ తట్టబందలో కండువాలు కప్పిన వారంతా అధికార పార్టీకి చెందిన వారేనని, దీనిపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఇందుకు వైసీపీ నాయకులు సిద్ధమా.. అని ఆయన సవాల్ విసిరారు. ఎన్నికల జిమ్మిక్కుల్లో భాగంగా అధికార పార్టీ ఇటువంటి దుష్ప్రచారం చేస్తుందని ఆరోపించారు. ఇటీవల బుచ్చియ్యపేట మండలంలో అధికార పార్టీ వారే విప్ ధర్మశ్రీ నాయకత్వాన్ని వ్యతిరేకించారన్నారు. దీంతో ఇటువంటి తప్పుడు ప్రకటనల ద్వారా బలం పెంచుకోవాలని ధర్మశ్రీ ప్రయత్నిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

దివ్యాంగులకు పరీక్ష కిట్లు పంపిణీ



పరీక్ష కిట్లు అందిస్తున్న సతీష్ తదితరులు

రావికమతం,మార్చి 4 : ఇక్కడి భవిత కేంద్రంలోని 20 మంది పదో తరగతి విద్యార్థులకు చోడవరానికి చెందిన ఉప్పల సతీష్ సోమవారం పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. అలాగే భవిత కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్, గోడ గడియారాన్ని కూడ అందజేశారు. మేడివాడ హైస్కూల్ హెచ్‌ఎం రామరావు, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు, జగన్నాథనాయుడు తదితరులు పాల్గొన్నారన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

రావికమతం, మార్చి4 : టి.అర్జాపురం పంచాయతీ శివారు కొట్నాబిల్లిలో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనాన్ని విప్ ధర్మశ్రీ సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ పైలరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, కంచిపాటి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యానికి గురైన బాలుడికి పింఛన్



నగదు అందిస్తున్నఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్

మాడుగుల రూరల్, మార్చి 4 : మండలంలోని గాదిరాయి గ్రామానికి చెందిన శిరశోళ్ల యశ్వంత్ కుమార్ అనే ఏడేళ్ల బాలుడు నికెల్ సెల్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ఇతడికి రూ.పది వేల పింఛన్ మంజూరు కావడంతో సోమవారం ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్, సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్రె రామునాయుడు, కాతా రమణ, కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.